నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | బుధవారం 20 మార్చి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## 'పది' విద్యార్థులకు ఉచితంగా ఆటో సేవలు


పదో తరగతి విద్యార్థులను తీసుకెళ్తున్న ఆటో డ్రైవర్లు

బెల్లంపల్లి, మార్చి 19 : బెల్లంపల్లి ఆటో డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థుల కోసం ఉచిత ఆటో సేవలు ప్రారంభించారు. పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులనూ ఉచితంగా కేంద్రాలకు తరలిస్తున్నారు. విద్యార్థులు ఆలస్యంగా వెళ్లి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు. అన్ని పరీక్షలు పూర్తయ్యే దాకా ఉచితంగా ఆటో సేవలు అందిస్తామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

## గురుకులాల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం


స్వరూపారాణి

మంచిర్యాలటౌన్, మార్చి 19 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురకులాల సంస్థ, గిరిజన సంక్షేమ గురుకులాల సంస్థ విద్యాలయాల్లో 2024–25 సంవత్సరానికిగాను 6,7,8,9 తరగతుల్లో మిగిలి సీట్లు (బ్యాక్‌లాగ్ వేకెన్సీలు) భర్తీ చేసేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరుతున్నట్లు రీజినల్ కో ఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి తెలిపారు. టీఎస్‌డబ్ల్యూఆర్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీవోఈ) అల్గునూర్ (కరీంనగర్ జిల్లా), గౌలిదొడ్డి (రంగారెడ్డి జిల్లా)లోని పాఠశాలల్లో తొమ్మిదో తరగతిలోకి మాత్రమే రెగ్యులర్ అడ్మిషన్లు కోరుతున్నారని పేర్కొన్నారు. అలాగే టీటీడబ్ల్యూఆర్‌ఎస్ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, వికారాబాద్ జిల్లా పరిగి (బాలికలు), ఖమ్మంలోని బాలుర పాఠశాలల్లో ఐదో తరగతిలో మాత్రమే రెగ్యులర్ ప్రవేశాల కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఈ నెల 23వ తేదీలోగా www.tswreis.ac.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. ఏప్రిల్ 21న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే

## ఎన్నికల ఫిర్యాదులపై
# తక్షణమే స్పందించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే
- కలెక్టరేట్‌లో మీడియా సెంటర్ ప్రారంభం

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, మార్చి 19 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సంబంధిత ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ, జిల్లా పౌర సంబంధాల అధికారి సంపత్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో నిబంధనలు ఉల్లంఘిస్తే టోల్ ఫ్రీ నంబర్ : 1950, ఫోన్ నంబర్ : 08733–279033లో సంప్రదించవచ్చని తెలిపారు.

### మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా చర్యలు

పదో తరగతి పరీక్షల్లో ఎలాంటి మాస్ కాపీయింగ్ పాల్పడకుండా పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కరెంటు కోతలు.. కర్షకులకు కన్నీళ్లు..

- అప్రకటిత విద్యుత్ కోతలతో ఎండుతున్న వరిపొలాలు
- బ్రేక్‌డౌన్ల సాకుతో ఇష్టారాజ్యంగా కట్
- లో వోల్టేజీతో కాలుతున్న మోటర్లు
- రైతన్నలకు తీరని నష్టం
- మళ్లా పాతరోజులచ్చినయంటూ ఆవేదన

కాంగ్రెస్ తెచ్చిన కరువు


లగ్గాంలో ఎండి పోతున్న వరి పొలం

దహెగాం, మార్చి 19 : కేసీఆర్ సర్కారులో వ్యవసాయానికి 24 గంటల పాటు ఉచితంగా కరెంట్ అందించగా, రైతులు రంది లేకుంట రెండు పంటలు తీశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యుత్ కోతల కారణంగా పంటలు ఎండిపోయి రైతాంగం కన్నీళ్లు పెట్టాల్సిన దుస్థితి దాపురించింది. ఈసారి యాసంగిలో దహెగాం మండలంలో బోరుబావుల కింద సుమారు 5 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇక అప్రకటిత కరెంట్ కోతలతో పంటలకు నీరందించలేని పరిస్థితి నెలకొంది. 24 గంటల కరెంట్ ఉంటుందని భావించిన రైతులకు, ఈ కోతలు తీరని నష్టాన్ని మిగులుస్తున్నాయి. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉంది. ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతుండడంతో పొలాలు నెర్రెలు బారుతున్నాయి. రోజుకు 6 గంటలు మాత్రమే విద్యుత్‌ను నిలిపివేస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ, వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉందని రైతులు చెబుతున్నారు. పగటి వేళల్లో బ్రేక్ డౌన్లు, ఎల్‌సీల సాకుతో గంటల పాటు కట్ చేస్తున్నారు. దీనికి తోడు రాత్రివేళల్లో ఏ సమయంలో విద్యుత్‌ను ఇస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. దీంతో పాటు తరచూ లో వోల్టేజీ కారణంగా మోటర్లు కాలిపోతున్నాయి. దహెగాం, లగ్గాం, ఒడ్డుగూడ, చంద్రపల్లి తదితర పంచాయతీల పరిధిలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని రైతులు ఆరోపిస్తున్నారు.


లగ్గాంలో విద్యుత్ కోతలతో నీరందక బీటలు బారుతున్న పొలం

### మళ్లా బతుకులు ఆగమయ్యేలా ఉన్నయ్



ఈసారి బోరుబావుల కింద ఆరెకరాల్లో వరి వేసిన. కరెంట్ సరిగా ఉండడం లేదు. నీరందక ఇప్పటికే రెండెకరాల దాకా ఎండిపోయింది. గతంలో రోజంతా కరెంట్ ఉండేది. ఇప్పుడు ఎప్పుడొస్తదో, ఎప్పుడు పోతదో తెలుస్తలేదు. సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేస్తే కలుస్తలేదు. కరెంట్ కోతల కారణంగా మా బతుకులు మళ్లా ఆగమయ్యేలా ఉన్నయ్.
**– గోపీనాథ్, రైతు, చౌక**

### రాత్రిళ్లు పొలం కాడే ఉంటున్నం



కరెంటు ఎప్పుడొస్తుందో తెలియక రాత్రిళ్లు పొలాల వద్దే పడుకుంటున్నం. అర్ధరాత్రి పూట త్రీఫేజ్ కరెంటు ఇస్తున్నరు. అది కూడా ఎంతసేపు ఉంటదో తెలుస్తలేదు. ఇప్పటికే పొలానికి నీళ్లు సరిపోక నెర్రెలుబారింది. పరిస్థితి ఇట్లనే ఉంటే పంటలు ఎండిపోయి, పెట్టిన పెట్టుబడులు కూడా రావు. చాలా ఇబ్బంది అవుతున్నది. రైతులకు మళ్లా పాత రోజులు వచ్చినట్లే కనిపిస్తున్నది. కేసీఆర్ గవర్నమెంట్ ఇచ్చినట్లే 24 గంటల కరెంట్ ఇస్తనే మేలు జరుగుతది.
**–దాద భీమయ్య, లగ్గాం**

### మోటర్లు కాలిపోతున్నయ్



కరెంటు లోవోల్టేజీ సమస్య బాగా ఉంది. దీంతో మోటర్లు కాలిపోతున్నయ్. 24 గంటల పాటు గతంలో నాణ్యమైన కరెంట్ ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. గిప్పుడు వరి పొట్ట దశలో ఉంది. కరెంట్ లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నయ్. మోటర్లు కాలిపోతే రైతులకు ఇప్పుడు అదనపు ఖర్చే.
**–దబ్బటి సత్యనారాయణ, ఎలక్ట్రీషియన్, దహెగాం**


మంచిర్యాలలోని కృష్ణవేణి హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ సంతోష్

## రెండో రోజూ ప్రశాంతంగా..

### పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

మంచిర్యాలటౌన్, మార్చి 19 : పదో తరగతి పరీక్ష (తెలుగు, ఉర్దూ, హిందీ) రెండోరోజైన మంగళవారం కూడా ప్రశాంతంగా సాగింది. జిల్లా వ్యాప్తంగా 51 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, 9,294 మంది విద్యార్థులకుగాను 9,273 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి హైస్కూల్‌లోని పరీక్ష కేంద్రాన్ని మంచిర్యాల కలెక్టర్ బాదావత్ సంతోష్ సందర్శించారు. భీమారం, చెన్నూరు, జైపూర్‌లోని పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ యాదయ్య తనిఖీ చేశారు. ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ రెండు పరీక్ష కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 18 పరీక్షా కేంద్రాలను సందర్శించినట్లు డీఈవో తెలిపారు.

# ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేయాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్
- రేపల్లెవాడలో చెక్ పోస్ట్ పరిశీలన


రేపల్లెవాడ అంతర్ జిల్లా చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేస్తున్న మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

తాండూర్, మార్చి 18 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని మూడు శాసనసభ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. తాండూర్ మండలం రేపల్లెవాడ వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్ పోస్టును అదనపు కలెక్టర్ రాహుల్‌తో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. అక్కడ ఉన్న సిబ్బందితో మాట్లాడారు. సిబ్బందికి వసతులు కల్పించారా.. రాత్రి సమయంలో విద్యుత్ సౌకర్యం ఉందా అని చెక్‌పోస్ట్ అధికారి, డిప్యూటీ తహసీల్దార్ పోచయ్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చెక్ పోస్ట్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రజలను ప్రలోభపెట్టే అంశాలైన నగదు, మద్యం, కానుకల రవాణాను అరికట్టాలని, సరైన ఆధారాలు లేకుండా రూ. 50 వేలకంటే ఎక్కువగా తరలించినట్లయితే సీజ్ చేయాలన్నారు. సరైన ఆధారాలున్నట్లయితే కలెక్టరేట్ భవనంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌లో సంప్రదించినట్లయితే 24 గంటల్లో సంబంధిత నగదును విడుదల చేస్తామన్నారు. సరైన ఆధారాలు లేకుండా రూ. 10 లక్షలకు మించి తరలించినట్లయితే ఆదాయ పన్ను శాఖ అధికారులు సీజ్ చేయడం జరుగుతుందని, తనిఖీల సమయంలో ప్రతి అంశాన్ని వీడియో రికార్డింగ్ చేయాలని తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ : 1950, సీ–విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, 100 నిమిషాల్లోగా పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. వారి వెంట తాండూర్ తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్‌కేడీ ప్రసాద్, తాండూర్ ఆర్ఐ అంజన్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

### తాండూర్‌లో అదనపు కలెక్టర్ పర్యటన

తాండూర్ మండలంలో జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) రాహుల్ మంగళవారం పర్యటించారు. తాండూర్ జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. తాండూర్‌లోని గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. బోయపల్లిలో ప్రైవేట్ లైబ్రరీ ఏర్పాటు చేసుకొని పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న యువతను ఆయన కలిసి అభినందించారు. తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్‌కేడీ ప్రసాద్, గిర్దావార్ అంజన్‌కుమార్, తదితరులు ఉన్నారు.


నగదు స్వాధీనం చేసుకుంటున్న సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ

## చొప్పరిపల్లిలో రూ.2.70 లక్షలు పట్టివేత

కాసిపేట, మార్చి 19 : కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చొప్పరిపల్లి సమీపంలోగల చెక్ పోస్ట్ వద్ద మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. మంచిర్యాల అమ్మాగార్డెన్‌కు చెందిన ఇప్పనపల్లి శ్రీధర్ వద్ద ఎలాంటి ఆధారాలు లేని రూ.1.50లక్షలు, ఆసిఫాబాద్‌కు చెందిన లెక్చరర్ చౌదరి సోమయ్య వద్ద రూ.1.20 లక్షలు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు.


కౌటాలలో ఈదురు గాలులతో కురుస్తున్న వర్షం..

## కౌటాలలో గాలివాన

కౌటాల, మార్చి 19 : మండలంలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఒక్కసారిగా గాలివానతో భారీ వర్షం పడగా, మక్క, ఇతర పంటలకు నష్టం వాటిల్లింది. ముత్తంపేటలోని పార్డీ చౌరస్తాలో వర్షపు నీరు చేరి రాకపోకలకు ఇబ్బంది అయ్యింది. రహదారి అధ్వానంగా మారడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.


పట్టుకున్న డబ్బులతో ఎస్ఐ రమేశ్

## సిర్పూర్(టీ)లో రూ.85వేలు..

సిర్పూర్(టీ), మార్చి 19 : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా మంగళవారం ఎస్ఐ దీకొండ రమేశ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్‌కు చెందిన నజీర్ ఖాన్ సిర్పూర్(టీ) మీదుగా పండరికౌడకు కారులో రూ. 85 వేలు తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అనంతరం డబ్బులను ఎఫ్ఎస్‌టీ రఘునాథ్‌కు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

## నిబంధనలు పాటించకుంటే చర్యలు


ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రావు

పెంచికల్‌పేట్, మార్చి19 : ఫర్టిలైజర్ దుకాణాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఎల్లూరు, ఎల్కపల్లి గ్రామాల్లో ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాములు, ఎరువులు, మందుల నిల్వలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఈపాస్ మిషన్ ద్వారానే ఎరువులు, మందులు విత్తనాలు అందజేయాలన్నారు. ప్రతి దుకాణాదారుడు ధరల పట్టికను ప్రదర్శించాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి రాజుల నాయుడు ఉన్నారు.





చోపిడి కంపార్ట్‌మెంట్‌లో ఎండిపోయిన మొక్కలు

# నాటారు.. మరిచారు


- మొక్కల సంరక్షణపై అటవీ శాఖ అశ్రద్ధ
- ఎండిపోతున్నా పట్టించని అధికారులు

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/ తిర్యాణి, మార్చి 19 : జిల్లాలో అడవుల విస్తీర్ణం పెంచడంలో భాగంగా అటవీ శాఖ యేటా నాటుతున్న మొక్కలు యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా ఎండిపోతున్నాయి. యేటా వానకాలంలో అటవీ శాఖ పెద్ద ఎత్తున మొక్కలను నాటుతున్నది. తిర్యాణి మండలంలోని చోపిడి, దేవాయిగూడ అటవీ ప్రాంతాల్లో కూడా అధికారులు పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. గతంలో చెట్లు నరికివేసిన ప్రాంతాల్లో గ్యాప్ ప్లాంటేషన్ ద్వారా అటవీ జాతి మొక్కలైన పేరుగన్నె, సండ్ర, నల్లమద్ది, నెమలిధార, సోమి, తదితర మొక్కలను నాటారు. వీటి ఆలనాపాలనను మాత్రం మరిచారు. దీంతో ఈ మొక్కలు ఎండిపోతున్నాయి. ఈ విషయమై తిర్యాణి అటవీ రేంజ్ అధికారి శ్రీనివాస్‌ను వివరణ కోరగా, అటవీ జాతి మొక్కలకు మూడు నెలల వరకు నీళ్లు లేకపోయినా తట్టుకుంటాయని తెలిపారు. మళ్లీ వర్షాలు వస్తే, చిగురిస్తాయని పేర్కొన్నారు.

## పోలీస్‌శాఖ పెట్రోల్ పంప్‌లో ఉద్యోగావకాశాలు

మంచిర్యాల ఏసీసీ, మార్చి 19 : మంచిర్యాల పట్టణంలోని పోలీస్‌స్టేషన్ పక్కన పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఇండియన్ ఆయిల్ కార్పొరేషన లిమిటెడ్ (ఐవోసీఎల్)పెట్రోల్ పంప్‌లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు రామగుండం కమిషనర్ ఎం.శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పెట్రోల్ ఫిల్లింగ్ చేయుటకు మూడు షిఫ్ట్‌ల వారీగా 15 మంది పురుషులు, మహిళలు (అర్హత ఇంటర్, వయస్సు 35 ఏండ్ల లోపు, జీతం రూ.10 వేలు), ఎయిర్ ఫిల్లింగ్ ఇద్దరు (అర్హత 10వ తరగతి, వయస్సు 35 ఏండ్ల లోపు, జీతం రూ.7 వేలు), స్కావెంజర్స్ ఒకరు (35 ఏండ్ల లోపు, జీతం రూ.7 వేలు) ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 22వ తేదీలోగా పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న నూతన పెట్రల్ పంప్‌లో అప్పగించాలని, ఇతర వివరాలకు ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ (సెల్ : 96522 25673) సంప్రదించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీపీ కోరారు.

## రెండేళ్ల తర్వాత తిరిగొచ్చిన రాబందులు


పాలరాపు గుట్టపై రాబందులు

పెంచికల్ పేట్, మార్చి19 : పెంచికల్‌పేట్ రేంజ్‌లోని నందిగాం అటవీప్రాంతంలోగల పాలరాపు గుట్ట రాబందులకు నిలయం. రెండేళ్ల నుంచి అవి కనిపించకపోగా, మంగళవారం రెండు రాబందులు ఆకాశంలో విహరిస్తూ కనిపించాయి. దీంతో అటవీ అధికారులు వాటిని తమ కెమెరాల్లో బంధించారు. తిరిగి వచ్చిన రాబందులను రక్షించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామని ఇన్‌చార్జి ఎఫ్ ఆర్వో సుధాకర్ తెలిపారు.